సాక్షి రంగారెడ్డి

బుధవారం : 21 : మే : 2025



ఏఎంసీ చైర్మన్ వర్సెస్..

చేవెళ్ల మార్కెట్ కమిటీలో చైర్మన్, డైరెక్టర్ల మధ్య సయోధ్య కుదరక రచ్చకెక్కుతున్నారు. పరస్పరం ఆరోపణలకు దిగుతున్నారు. 8లో▸



సామాజిక తనిఖీ

ఉపాధి పనుల్లో అవకతవకలు పరిపాట య్యాయి. సామాజిక తనిఖీలో పలు అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. 8లో▸



మెకానిక్ షెడ్‌లో ప్రమాదం

మరమ్మతుల కోసం తీసుకువచ్చిన కారు నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించి ఐదు కార్లు దగ్ధమయ్యాయి. 8లో▸

పెళ్లింట.. మృత్యుఘోష

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు



లారీని ఢీకొడంతో నుజ్జునుజ్జయిన ట్రావెల్స్ బస్సు



మల్లేశ్ (ఫైల్)



సందీప్ (ఫైల్)



బాలమ్మ (ఫైల్)



హేమలత (ఫైల్)

- చిన్నవిందుకు హాజరై వస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం
- అక్కడికక్కడే నలుగురు మృతి, 20 మందికి గాయాలు
- పరిగి మండలం రంగాపూర్ వద్ద ఘటన
- మృతుల్లో పెళ్లికొడుకు బావ, మేనబావ

పరిగి/షాబాద్: హైదరాబాద్– బీజాపూర్ రహదారి రక్తసిక్తమైంది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా 20 మంది గాయపడ్డారు. వీరిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉంది. పెళ్లింట నిర్వహించిన చిన్నవిందుకు హాజరై వెళ్తున్న క్రమంలో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. పెళ్లికూతురు, పెళ్లికొడుకుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుల్లో షాబాద్ మండలం సీతారాంపూర్‌కు చెందిన మల్లేశ్(35), ఇదే మండలం సోలిపేట్‌కు చెందిన బాలమ్మ (60), చేవెళ్ల మండలం రావులపల్లికి చెందిన హేమలత(32), ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్‌కు చెందిన సందీప్(28) ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎస్‌ఐ సంతోష్‌కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరిగి ఆస్పత్రికి అక్కడి నుంచి తాండూరు, హైదరాబాద్ ఆస్పత్రులకు తరలించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పరిగి ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ఎలా జరిగిందంటే..

వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన రామకృష్ణ, స్వప్న దంపతుల కూతురు మల్లేశ్వరిని రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందనవెల్లికి చెందిన సతీష్‌కు ఇచ్చి ఈనెల 16న పరిగిలో వివాహం జరిపించారు. 19న చిన్న విందు ఏర్పాటు చేయడంతో పెళ్లి కొడుకు బంధువులు సుమారు 50 మంది ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో రాత్రి 8.30 గంటలకు చందనవెల్లి నుంచి పరిగికి చేరుకు న్నారు. బస్సును పార్కింగ్ చేసి వస్తానని వెళ్లిన డ్రైవర్.. ఇదే ట్రావెల్స్‌కు చెందిన మరో బస్సు పాడవడంతో అందులో ఉన్నవారిని పరిగి నుంచి వారి గమ్యస్థానంలో వదిలేసి, తిరిగి అర్ధరాత్రి 1.20 గంటలకు పరిగికి చేరుకున్నాడు. పెళ్లికూతురు, పెళ్లికొడుకుతో పాటు బంధువులతో కలిసి చందనవెల్లి బయలుదేరారు. పది నిమిషాలు కూడా గడవకముందే రంగాపూర్ వద్ద ఎదురుగా వస్తున్న లారీకి సైడ్ ఇచ్చే క్రమంలో రోడ్డు పక్కన ఎడమ వైపు నిలిపి ఉన్న సిమెంట్ లోడ్ లారీని బలంగా ఢీకొట్టింది.

పెళ్లి కొడుకు బావ మృతి

పెళ్లికొడుకు సతీష్ బావ (అక్క భర్త) మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతని భార్య, ముగ్గురు పిల్లలు సైతం ఇదే బస్సులో ఉన్నారు. మృతుల్లో కిషన్‌నగర్‌కు చెందిన సందీప్‌కు ఆరు నెలల క్రితమే వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం నాగుపల్లికి చెందిన మహేశ్వరితో వివాహం జరిగింది. పెళ్లికుమారుడికి మేనబావ కావడంతో ఏర్పాట్లన్నీ దగ్గరుండి చూసుకున్నారు. ఇతని తండ్రి గతంలోనే మృతిచెందగా ఒకేఒక్క కుమారుడైన సందీప్ అకాల మృతితో అతని కుటుంబం విలవిల్లాడుతోంది.

తల్లి మృతి, ప్రాణాపాయంలో కూతురు



మోక్షిత

ప్రమాద స్థలంలో మృతిచెందిన హేమలత కూతురు మోక్షిత(5)కు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని నీలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. మిగిలిన వారిని వికారాబద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. సుజాత, నీరజ, నిహారి, మహేశ్, అరుణ, సాహితికి కాళ్లు, చేతులు విరిగాయి. ప్రియాంక, కార్తీక్, రమేశ్, లక్ష్మి, రాములు, మంజుల, సుజాత, నవనీతకు స్వల్ప గాయాలయ్యాయి.

రుధిర దారులు



బీజాపూర్ రహదారిపై ఢీకొన్న వాహనాలు (ఫైల్)

- రక్తపుటేరులు పారిస్తున్న రహదారులు
- తరచూ వెలుగుచూస్తున్న ప్రమాదాలు
- అబ్దుల్లాపూర్‌మెట్‌లో నిలిచిన విస్తరణ పనులు
- ఇప్పటికీ ప్రారంభం కాని బీజాపూర్ రోడ్డు వెడల్పు
- సాగర్, శ్రీశైలం, బెంగళూరు హైవేల్లోనూ ఇదే పరిస్థితి

- గత ఏడాది డిసెంబర్ 2న చేవెళ్ల సమీపంలోని ఆలూరు స్టేజ్ వద్ద రోడ్డు వెంట కూరగాయలు అమ్ముకుంటున్న వారిపై నుంచి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- తర్వాత రెండు రోజులకే మీర్జాగూడ గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పొద్దుటూరుకు చెందిన దంపతులు మృతి చెందారు.
- ఈ ఏడాది మే 3న హైదరాబాద్ నుంచి ఆమనగల్లు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మహేశ్వరం మండలం తుమ్మలూరు గేటు సమీపంలోని ఓ హోటల్ వద్ద నిలిపి ఉంచిన మరో టూరిస్టు బస్సును ఢీ కొట్టిన ఘటనలో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి.
- మే 10న అర్ధరాత్రి శంషాబాద్ నుంచి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న కారు పెద్ద అంబర్‌పేట్ సమీపంలో రహదారిపై ఆగిఉన్న బొలెరో వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో నగరానికి చెందిన ముగ్గురు యువకులు సజీవ దహనమయ్యారు.
- రెండు రోజుల క్రితం తెల్లవారు జామున పెద్ద అంబర్‌పేట నుంచి ఘట్‌కేసర్ మార్గ మధ్యలో ఆగిఉన్న పాల ట్యాంకర్‌ను లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన లారీ డ్రైవర్ మృతి చెందాడు.
- తాజాగా పరిగి మండలం రంగాపూర్ సమీపంలో చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన నలుగురు మృత్యువాత పడగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు.

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని ఔటర్ రింగ్‌రోడ్డు సహా శ్రీశైలం, సాగర్, విజయవాడ, బీజాపూర్, బెంగళూరు జాతీయ రహదారులపై రక్తపుటేరులు పారుతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇరుకైన రహదారులను విస్తరించకపోవడం, మృత్యు కుహరాలుగా మారిన మలుపులను సరి చేయక పోవడంతో ఆయా మార్గాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. వందల మంది మృత్యువాతపడుతున్నా.. వేలాది మంది క్షతగాత్రులవుతున్నా పాలకుల్లో మాత్రం చలనం రావడం లేదు.

మూడేళ్ల క్రితమే శంకుస్థాపన

హైదరాబాద్ నుంచి బీజాపూర్ వెళ్లే రోడ్డు (163 జాతీయ రహదారి)ఇరుగ్గా, నిత్యం రద్దీగా ఉంటుంది. రోజుకు కనీసం 30 వేలకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అనేక మలుపులతో కూడిన ఈ రహదారిపై పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మూడేళ్ల వ్యవధిలోనే 379 ప్రమాదాలు చోటు చేసుకోగా, 146 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 400 మంది క్షతగాత్రులయ్యారు. అప్పా నుంచి మన్నెగూడ జంక్షన్ వరకు (46 కిలోమీటర్లు.. 66 మలుపులు) నాలుగు లేన్లుగా విస్తరించాలని ఆరేళ్ల క్రితమే నిర్ణయించారు. ఈ మేరకు రూ.928.41 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. మొత్తం 266.55 హెక్టార్ల భూమి అవసరమని గుర్తించారు. ప్రభుత్వ భూమి 69.25 హెక్టార్లు కాగా, ప్రైవేటు వ్యక్తుల నుంచి మిగతాది సేకరించాల్సి ఉంది. దారి పొడవునా 18 అండర్‌పాసులు, మొయినాబాద్ సమీపంలో 4.35 కిలోమీటర్లు, చేవెళ్ల సమీపంలో 6.36 కిలోమీటర్ల మేర రెండు బైపాస్‌లు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రోడ్డు పనులకు 29 ఏప్రిల్ 2022లో అప్పటి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ శంకుస్థాపన చేశారు. టెండరు సైతం ఖరారైంది. ఇప్పటికీ పనులు మాత్రం మొదలు కాలేదు. రక్తపుటేరులు పారుతూనే ఉన్నాయి.

అండర్‌పాసుల విషయంలో తేల్చక..

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 65) విస్తరణ పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. రూ.600 కోట్ల అంచనా వ్యయంతో ఎల్బీనగర్ నుంచి దండుమైలారం వరకు 24 కిలోమీటర్ల మేర చేపట్టిన పనులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. అబ్దుల్లాపూర్‌మెట్ చౌరస్తా నుంచి దాదాపు రెండు కిలోమీటర్ల మేర పనులు నిలిచిపోయాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలు అటు ఇటు వెళ్లేందుకు వీలుగా మార్గ మధ్యలో మొత్తం ఎనిమిది చోట్ల అండర్ పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. వీటిలో నాలుగు చోట్ల పనులు పూర్తి చేశారు. వనస్థలిపురం పనామా, హయత్‌నగర్ కుంట్లూరు, అబ్దుల్లాపూర్‌మెట్ కూడలి ఘట్‌కేసర్ రోడ్డు సహా అనాజీపూర్ మార్గంలో పనులు మూడు నెలల క్రితమే నిలిచిపోయాయి. ఇక్కడ పిల్లర్స్‌తో రోడ్డును నిర్మించాలా.. అండర్ పాస్‌లను నిర్మించాలా అనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నారు. బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల్లోనూ ఇదే తరహా జాప్యం కొనసాగుతోంది. శంషాబాద్ కొత్తూరు మధ్య పనులు మందకొడిగా సాగుతున్నాయి. శ్రీశైలం, సాగర్ రోడ్డు విస్తరణ పనుల ప్రస్తావన కూడా లేదు.

న్యూస్‌రీల్

పంటల సాగులో అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న వీసీ డాక్టర్ అల్దాస్ జానయ్య

యాచారం: ప్రభుత్వ గుర్తింపు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ అల్దాస్ జానయ్య అన్నారు. మండల పరిధిలోని మాల్ రైతు వేదికలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. పంటల సాగులో రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలని, తక్కువ శ్రమతో అధిక దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు. నీటి ప్రాముఖ్యత, వినియోగం సమర్థత, వరిలో వైవిధ్యీకరణ అవసరంపై తెలియజేశారు. వానాకాలం ప్రారంభం కాగానే ప్రతి రెవెన్యూ గ్రామంలో ముగ్గురు రైతులకు మేలైన వివిధ రకాల విత్తనాలను ఉచితంగా అందించనున్నట్టు వెల్లడించారు. రైతులు అవగాహన పొంపొందించుకోవడానికి రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం ఎంతో దోహదపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రామకృష్ణబాబు, సునీత, ఇబ్రహీంపట్నం ఏడీఏ సుజాత, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్, పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి



సభ్యత్వం చేయిస్తున్న సంఘం నాయకులు

షాబాద్: ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు గందె సురేష్‌గుప్తా పేర్కొన్నారు. మండల కేంద్రంలో మంగళవారం సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘంలో సభ్యత్వం లేని వారు నూతనంగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. వృద్ధాప్య భృతి కోసం 60 ఏళ్ల పైబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆర్యవైశ్యులకు సంఘం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దండు రాహుల్ గుప్తా, ట్రెజరర్ నీల రవీందర్‌గుప్తా, జిల్లా కార్యదర్శి చొక్కంపేట రాకేష్ గుప్తా, షాబాద్, ఫరూఖ్‌నగర్ మండలాల అధ్యక్షులు పాపిశెట్టి సాయిరాంగుప్తా, నారాయణ, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్ మలిపెద్ది శ్రీనివాసులు, ఫరూఖ్‌నగర్ మండల మాజీ అధ్యక్షుడు మురళి, సంఘం సభ్యులు గడ్డం రమేష్‌గుప్తా, ఉప్పు శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను వేగిరం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

ఆమనగల్లు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల పథకంపై ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల అధికారులంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు వెంటనే ప్రొసీడింగ్స్ అందించాలన్నారు. ఈనెల 25లోపు ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎప్పటికప్పుడు బిల్లులు గ్రౌండింగ్ చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ కుసుమమాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, హౌసింగ్ డీఈ సురేశ్, ఎంపీఓ వినోద, ఏఈ అభిషేక్ పాల్గొన్నారు.

నేడు ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

మున్సిపల్ పరిధిలోని సంకటోనిపల్లి, మండల పరిధిలోని సీతారాంనగర్‌తండాలో బుధవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంపీడీఓ కుసుమమాధురి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేస్తారని, అనంతరం లబ్ధిదారులకు మంజూరు ఉత్తర్వు పత్రాలు పంపిణీ చేస్తారని తెలిపారు.



సీసీ కెమెరాలను ప్రారంభించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

మహేశ్వరం: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని రాచకొండ సీపీ సుధీర్‌బాబు పేర్కొన్నారు. మండల పరిధిలోని తుమ్మలూరు మ్యాక్ ప్రాజెక్టులో బీటీఆర్ విల్లాస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 320 ఐపీ సీసీ కెమెరాలను మంగళవారం ఆయన మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. విల్లాస్, అపార్ట్‌మెంట్లు, కాలనీలు, గ్రామాల్లో నేరాలను అరికట్టడానికి సీసీ కెమెరాలు ఎంతోగానో దోహదపడతాయని తెలిపారు. వీటితో కేసుల పరిష్కారం సులభతరం అవుతుందని, నేర శోధన, నేర నివారణకు ఎంతగానో తోడ్పడతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బీవీ సత్యనారాయణ, మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, గురువారెడ్డి, మ్యాక్ బీటీఆర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.ప్రతాప్ రెడ్డి, కోశాధికారి నాదేళ్ల రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ డా.కె.అనిల్‌కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన మెట్రో చార్జీలపై 10 శాతం తగ్గింపు

సాక్షి, సిటీబ్యూరో: పెంచిన చార్జీలపై మెట్రో 10 శాతం రాయితీ ప్రకటించింది. ఈ నెల 24 నుంచి ఈ తగ్గింపు అమల్లోకి రానుంది. ఇటీవల మెట్రో చార్జీలను గరిష్టంగా 30 శాతం వరకు పెంచిన సంగతి తెలిసిందే. దీంతో కనిష్టంగా రూ.12 నుంచి గరిష్టంగా రూ.75 వరకు చార్జీలు పెరిగాయి. సగటు ప్రయాణికుడిపై రూ.15 అదనపు భారం పడింది. తర్వాత రెండు రోజుల పాటు పరిశీలించిన ఎల్‌అండ్‌టీ హైదరాబాద్ మెట్రోరైల్ సంస్థ.. ఒక అడుగు వెనక్కి తగ్గి 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ (ఎఫ్ఎఫ్‌సీ) సిఫార్సులకు అనుగుణంగా చార్జీలను పెంచినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రయాణికులకు మరింత మెరుగైన, నాణ్యమైన రవాణా సదుపాయాలను అందజేసేందుకు, మెట్రో సేవలను మరింత బలోపేతం చేసేందుకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

పీఏసీఎస్‌ల సేవలు భేష్



చేగూరు పీఏసీఎస్ వద్ద ఇండోనేషియా అధికారుల బృందం

ఇండోనేషియా అధికారుల బృందం కితాబు

నందిగామ: మండల పరిధిలోని చేగూరు పీఏసీఎస్‌ను మంగళవారం ఇండోనేషియా వ్యవసాయ అధికారుల బృందం సందర్శించింది. ఇండోనేషియా జాతీయ అభివృద్ధి ప్రణాళిక మంత్రిత్వ శాఖ ఉప మంత్రి బాపక్ లీనార్డో, టాగ్ సంబాడో ఆధ్వర్యంలో 15 మంది సీనియర్ అధికారుల బృందం రైతులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాల సరఫరా, ఆధార్ ఆధారిత పంపిణీ విధానం, రికార్డుల నిర్వహణ, పారదర్శకత తదితర వివరాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పీఏసీఎస్‌ల నిర్వహణ, రైతులకు అందిస్తున్న సేవలు ప్రేరణాత్మకంగా ఉన్నాయని కితాబిచ్చారు. వ్యవసాయ రంగంలో ఇక్కడి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర దేశాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రశంసించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, ఇన్‌చార్జి ఏడీఏ నిశాంత్ కుమార్, ఏడీఏ మాధవి, ఏఈఓ రవి, డీసీసీబీ షాద్‌నగర్ మేనేజర్ మంకాల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హై లెవల్ చేతికి పరిహారం!

- అవకతవకలు, అక్రమాలకు చెక్ పెట్టేలా సర్కార్ చర్యలు
- కలెక్టర్ సారథ్యంలో ప్రత్యేక కమిటీ
- బృందంలో మరో నలుగురు..
- ఇక నుంచి వారి నిర్ణయం మేరకే పరిహారం చెల్లింపు



పరిహారం అందని అసైన్డ్ భూములను పరిశీలించడానికి వెళ్తున్న అధికారులు (ఫైల్)

యాచారం: ప్రజాప్రయోజనాల నిమిత్తం, వివిధ సంస్థలకు అప్పగించే భూసేకరణకు సంబంధించి సర్కార్ హై లెవల్ కమిటీని నియమించడానికి నిర్ణయించింది. ఇక నుంచి ఈ కమిటీ నిర్ణయం మేరకే భూములిచ్చే రైతులకు పరిహారం అందజేస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల పరిధిలోని పది గ్రామాల్లో ఫార్మాసిటీ కోసం 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించడానికి నిర్ణయించి 14 వేల ఎకరాలు సేకరించింది. పట్టా భూములకు అందజేసిన పరిహారం విషయంలో ఇబ్బందులు రానప్పటికీ అసైన్డ్‌పట్టాలు, ప్రభుత్వ భూముల్లో కబ్జాలున్న రైతులకు అందజేసిన పరిహారం చెల్లింపులో పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. మొదట్లో అసైన్డ్ భూములకు సాగు యోగ్యమైన భూమికి మాత్రమే పరిహారం అందజేశారు. తర్వాత కొందరు అధికారులతో కుమ్మక్కై పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న భూమికి మొత్తం నకిలీ పేర్ల మీద పరిహారం కాజేశారు. దీంతో నిజమైన అసైన్డ్‌దారులకు అన్యాయం జరిగింది. అన్యాయానికి గురైన అసైన్డ్‌దారులు నేటికీ తమను ఆదుకోవాలని కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అన్నీ నిర్ధారించాకే..

పరిహారం అందజేతలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించిన కాంగ్రెస్ సర్కార్ చర్యలకు ఉపక్రమించింది. ఇక నుంచి జిల్లాలోని ఏ మండలం, ఏ గ్రామంలోనైనా ప్రజాప్రయోజనాలు, ప్రముఖ సంస్థలకు భూములు అప్పగించే విషయంలో హై లెవల్ కమిటీ నిర్ణయం మేరకే ప్రజాభిప్రాయ సేకరణ, భూసేకరణ, పరిహారం అందజేత, రైతులతో మాట్లాడి నచ్చజెప్పడం వంటి చర్యలు తీసుకోనుంది. కలెక్టర్ సారథ్యంలో ఏర్పాటయ్యే కమిటీలో అడిషనల్ కలెక్టర్, సర్వేశాఖ జిల్లా అధికారి, ఆర్డీఓ, తహసీల్దార్ ఉండనున్నారు. నిజమైన రైతులకు పరిహారం అందజేత విషయంలో క్షేత్రస్థాయిలో ప్రజాభిప్రాయం, రెవెన్యూ రికార్డుల పరిశీలన, భూమికి సంబంధించి సర్వే మ్యాప్, హద్దుల నిర్ధారణ ద్వారా పరిహారం అందజేస్తారు.

250 ఎకరాలకు పైగా ..

యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లోని 250 ఎకరాలకుపైగా పరిహారం అందజేసేలా అధికారులు నిర్ణయించారు. ఫార్మాసిటీకి సేకరించిన భూములకు సంబంధించి తాజాగా అధికార యంత్రాంగం సర్వే, ఫెన్సింగ్ పనులు నిర్వహిస్తోంది. ఆయా గ్రామాల్లోని అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులు తమకు పరిహారం అందలేదని పనులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ ఆయా గ్రామాల్లోని అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా కబ్జాలో ఉన్న భూముల వద్దకు వెళ్లి రైతులతో మాట్లాడారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 80 మందికి పైగా రైతులు 250 ఎకరాలకుపైగా అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు సర్కార్‌కు నివేదిక అందజేశారు. పరిహారం విషయంలో మరోసారి పొరపాట్లు జరగకుండా కలెక్టర్ సారథ్యంలో హై లెవల్ కమిటీని ఏర్పాటు చేసి తర్వాతే బాధిత రైతులకు అందజేసేలా సర్కార్ దృష్టి సారించింది.

అన్యాయం జరగకుండా చూస్తాం



ఫార్మాసిటీకి భూములు సేకరించిన గ్రామాల్లో కొందరికి పరిహారం అందలేదని గుర్తించాం. త్వరలో కలెక్టర్ సారథ్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటవుతుంది. కమిటీ నిర్ణయం ప్రకారం బాధిత రైతులకు పరిహారం అందజేస్తాం. ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చూస్తాం.

– అనంత్‌రెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

రెండు రోజులు సెలవులో ఉన్నా..

- నాపై చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదు
- యాచారం ఎస్‌ఐ మధు

యాచారం: తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది పగడాల శ్రీశైలం తనపై రాచకొండ సీపీ సుధీర్‌బాబుకు చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని యాచారం ఎస్‌ఐ మధు అన్నారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ.. శ్రీశైలం ఆరోపణల్లో నిజం లేదన్నారు. ఏప్రిల్ 13, 14 తేదీల్లో తమ కూతురు పుట్టిన రోజు వేడుకలు ఉన్నందున రెండు రోజులు సెలవులో ఉన్నట్లు వివరించారు.

తీరని విషాదం

కన్నీటి సంద్రంలో రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలు

- పలువురు నేతల పరామర్శ

షాబాద్, పరిగి: రంగాపూర్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి స్వగ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన ముత్యాల మల్లేశ్‌కు భార్య స్వప్న, ఇద్దరు కూతుళ్లు మాన్యశ్రీ, ఆర్యాధ్య, కుమారుడు ప్రనిల్ ఉన్నారు. మల్లేశ్ మండల పరిధిలోని నాగర్‌గూడలో కులవృత్తి అయిన కటింగ్ షాప్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మృతి చెందడంతో భార్యాపిల్లలు దిక్కులేనివారయ్యారు. సోలీపేట్‌కు చెందిన మంగలి బాలమ్మకు ముగ్గురు కుమారులు, ఓ కూతురు ఉన్నారు. అందరి వివాహాలయ్యాయి. చేవెళ్ల మండలం రావులపల్లికి చెందిన హేమలత తన ఇద్దరు పిల్లలను తీసుకుని పెళ్లికి వెళ్లింది. రోడ్డు ప్రమాదంలో ఆమె అక్కడిక్కడే మృతి చెందగా, మోక్షిత నీలోఫర్‌లో చికిత్స పొందుతోంది.

న్యాయం జరిగేలా చూస్తాం..



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న మధుసూదన్‌రెడ్డి

రంగాపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, డాక్టర్ రాజు, మాజీ ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్దన్ రెడ్డి, మహేందర్‌గౌడ్, రాజేందర్‌రెడ్డి, నరేందర్, రఫిక్, దయాకర్ తదితరులు పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా కృషిచేస్తామని తెలిపారు.

అనాథలయ్యాముర..



తమ్ముడు, తండ్రిని పట్టుకుని విలపిస్తున్న స్వప్న

‘తమ్ముడూ మీ బావ లేడురా.. మనల్ని వదిలి వెళ్లాడురా.. నేను, నా పిల్లలు అనాథలయ్యాముర’.. అంటూ పెళ్లి కుమారుడి (సతీష్) అక్క స్వప్న తన తమ్ముడి పట్టుకుని విలపించింది. తండ్రి రామస్వామి రాగానే నా బతుకు ఆగమయ్యింది నాన్నా అంటూ రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

ఇరిగేషన్ శాఖ డీఈఈ ఆత్మహత్య



వెంకటరామరాజు మృతదేహం

శంషాబాద్: పురుగుల మందు తాగి నీటి పారుదల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం ఆర్‌జీఐఏ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ బాలరాజు తెలిపిన ప్రకారం.. కొత్వాల్‌గూడ చౌడమ్మ దేవాలయ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఆర్‌జీఐఏ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి అతను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. పర్సులో లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా అతడు నాగోల్‌లో నివాసముంటున్న నేరెళ్ల వెంకటరామరాజు(63)గా గుర్తించారు. నీటి పారుదల శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తున్నట్లు ఉంది. అతడి వద్ద లభ్యమైన ఫోన్ నంబర్ల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా తాము తిరుపతిలో ఉన్నట్లు తెలిపారు. దీంతో మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

తుర్కయంజాల్: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. పురపాలక సంఘం పరిధిలోని తొర్రూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయకపోవడంతో దళారులకు క్వింటా రూ.1,700 రైతులు అమ్ముకుని రూ.600 నష్టపోతున్నారని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కరువయ్యాయని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు నోముల దయానంద్ గౌడ్, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహా రెడ్డి, నాయకులు కందాల బల్‌దేవ్ రెడ్డి, పోరెడ్డి అర్జున్ రెడ్డి, కొత్త రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్‌లో అగ్ని ప్రమాదం

- ఐదు కార్లు దగ్ధం
- రూ.20 లక్షల నష్టం



దగ్ధమైన కార్లు

షాద్‌నగర్: మరమ్మతుల కోసం తీసుకువచ్చి న కారు నుంచి అకస్మాత్తుగా మంటలు వ్యాపించి ఐదు కార్లు దగ్ధమయ్యాయి. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున షాద్‌నగర్ పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన గణేష్ యాదవ్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో జాతీయ రహదారి పక్కన మెకానిక్ షెడ్ నిర్వహిస్తున్నాడు. మరమ్మతుల కోసం వచ్చిన కార్లను షెడ్‌లోఉంచి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున సుమారు 4గంటల ప్రాంతంలో షెడ్‌లో ఉన్న ఓ కారు బ్యాటరీ నుంచి మంటలు వ్యాపించి ఐదు కార్లు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలికి చేరుకొని మంటలార్పారు. సుమారు రూ.20లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫాంహౌస్‌లో హుక్కా పార్టీ

పోలీసుల అదుపులో పది మంది యువకులు, ఇద్దరు మైనర్లు



శంషాబాద్ రూరల్: ఫాంహౌస్‌లో హుక్కా పార్టీ జరుపుకుంటున్న యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన కొందరు యువకులు గండిగూడ శివారులోని ఎంఆర్‌జీ ఫాంహౌస్‌లో హుక్కా పార్టీ చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ చేసుకుంటున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నట్లు సమాచారం. హుక్కా పరికరాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

- అక్రమాలపై చర్యలు తీసుకోవడం లేదంటూ ఆందోళన
- డీఆర్డీఓ శ్రీలత హామీతో శాంతించిన కూలీలు, ఆందోళన కారులు



ప్రజావేదిక సభ వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు

యాచారం: ఉపాధి పనుల్లో అవకతవకలు పరిపాటయ్యాయి. మంగళవారం మండల కేంద్రంలో 16వ ఈజీఎస్ సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీఓ శ్రీలత, అంబుడ్స్‌మెన్ సునీత, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఏపీడీ చరణ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, ఎంపీఓ శ్రీలత, ఏపీఎం లింగయ్య ఆధ్వర్యంలో ఈ ప్రజావేదిక కొనసాగింది. మండల పరిధిలోని 24 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు రూ.5.5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి కూలీలకు ఉపాధి కల్పించినట్లు గుర్తించారు. పలు గ్రామాల్లో సక్రమంగా రికార్డులు నమోదు చేయకపోవడం, కూలీలు చేసిన పనులకు సకాలంలో డబ్బులు జమ కాకపోవడం, ఒకరి పేరు మీద రికార్డులు మరొకరి పేరిట నమోదు చేయడం వంటి అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సందర్భంగా డీఆర్డీఓ శ్రీలత మాట్లాడుతూ.. ఉపాధి పనులు కల్పించే విషయంలో గాని, కూలీలకు డబ్బులు ఇచ్చే విషయంలో గాని, స్లిప్పులు అందజేసే విషయంలోగాని తప్పులు చేసిన వారిని వదలమని హెచ్చరించారు. కూలీలకు చేతినిండా పని కల్పించి సకాలంలో డబ్బులు అందించాలన్నదే సర్కార్ లక్ష్యమని చెప్పారు. ఏ గ్రామంలో ఏ తప్పు జరిగిందో.. ఆడిట్ సిబ్బంది గుర్తిస్తున్నారని వివరించారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను సాయంత్రం వరకు కేవలం పది గ్రామాల వివరాలనే ఆడిట్ సిబ్బంది వెల్లడించారు.

గోప్యంగా ప్రజావేదిక సభ

ఈజీఎస్ సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక సభ మండల పరిషత్ సమావేశ మందిరంలో పెట్టడంపై కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు అంజయ్య మాట్లాడుతూ.. ప్రజావేదిక సభ తేదీని ఈజీఎస్ అధికారులు గోప్యంగా ఉంచారన్నారు. గతంలో వెలుగులోకి వచ్చిన అక్రమాలపై ఎంత మంది మీద చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు రావడం లేదని.. కూలీలు పనులు చేసి పస్తులుంటున్నారని.. పలుమార్లు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళనలు, ధర్నాలు చేపట్టినా ఫలితం లేదన్నారు.

ఆటోడ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆటో జేఏసీ నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ఆటో ఆకలి కేకల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరుతూ 25 రోజులుగా నిర్వహిస్తున్న ఆటో రథయాత్ర మంగళవారం ఆమనగల్లుకు చేరుకుంది. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆటో రథయాత్రకు స్థానిక ఆటో జేఏసీ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం మహాసభ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంద రవి కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోడ్రైవర్లకు ఉపాధి కరువైందని అన్నారు. 83 మంది ఆటోడ్రైవర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం అందించాలని, ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు అందించాలని, ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనెల 27న జరిగే మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ వర్సెస్ డైరెక్టర్లు

- చేవెళ్ల మార్కెట్ కమిటీ పాలకవర్గంలో మనస్పర్థలు
- అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపణలు



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, సెక్రటరీ మహేందర్

చేవెళ్ల: చేవెళ్ల మార్కెట్ కమిటీలో చైర్మన్, డైరెక్టర్ల మధ్య సయోధ్య కుదరక రచ్చకెక్కుతున్నారు. తాను మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తుంటే తనపై కుట్రతో ఆరోపణలు చేస్తున్నారని.. డైరెక్టర్లు మార్కెట్ కార్యదర్శి మహేందర్‌కు ఫోన్ చేసి ప్రతీ నెలా డబ్బులివ్వాలని బెదిరిస్తున్నారంటూ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ ఆరోపిస్తుంటే.. చైర్మన్ తమను పట్టించుకోవడం లేదని.. మార్కెట్ కార్యదర్శితో కలిసి అవినీతికి పాల్పడుతున్నారంటూ మార్కెట్‌కమిటీ డైరెక్టర్లు ఆరోపణలతో వివాదం మొదలైంది.

అభివృద్ధికి సహకరించాలి

చేవెళ్ల మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కార్యదర్శి మహేందర్ మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అసత్య ఆరోపణలతో మార్కెట్‌ను బదనాం చేస్తున్నారని.. వారి సొంత నిర్ణయాలను ప్రశ్నిస్తే ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మార్కెట్ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే సహకారంతో రూ.2 కోట్లకు పైగా నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. కొందరు డైరెక్టర్లు చిన్న విషయాలను రాద్ధాంతం చేస్తున్నారన్నారు. సెక్రటరీకి ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడడం, డబ్బులు డిమాండ్ చేయడం, కమీషన్ ఏజెంట్ల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నామంటూ అసత్యాలు ప్రచారం చేయడం సరికాదన్నారు. అవి నిజమైతే రుజువు చేయాలని డిమాండ్ చేశారు. పాలకవర్గ సమావేశంలో తీర్మానాలు చేసిన డైరెక్టర్లే తాము చేయ లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా డైరెక్టర్లు మార్కెట్ అభివృద్ధికి కలిసిరావాలన్నారు.

పదవులకు రాజీనామా చేస్తాం: డైరెక్టర్లు

మార్కెట్ అభివృద్ధి కోసం చైర్మన్‌ను ప్రశ్నిస్తే తమపై కార్యదర్శితో ఆరోపణలు చేయించడం సరికాదని డైరెక్టర్లు జనార్ధన్, మల్లేశ్, నరేందర్, సత్యనారాయణ, హనీఫ్ అన్నారు. మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన వివరాల లెక్కలు అడిగితే తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య జన్మదిన వేడుకలకు పాలకవర్గాన్ని పట్టించుకోకుండా చైర్మన్ ఒక్కరే తన ఫొటోతో ఫ్లెక్సీలు వేయించుకుని పాలకవర్గాన్ని దూరం పెట్టాడన్నారు. డైరెక్టర్లు లేకుండానే మార్కెట్ కమిటీ సమావేశం నిర్వహించి తాము హాజరైనట్లు రికార్డు చేశారని ఆరోపించారు. కమీషన్ ఏజెంట్లు తక్ పట్టీలు ఇవ్వడం లేదని చెబితే పట్టించుకోవడం లేదన్నారు. తక్ పట్టీలు ఇవ్వకుండా చైర్మన్, కార్యదర్శి కలిసి అడ్డుకుంటున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే డైరెక్టర్లు డబ్బులు డిమాండ్ చేశారని ఆరోపిస్తున్నారని అన్నారు. అవసరమైతే తమ డైరెక్టర్ల పదవులకే రాజీనామాలు చేస్తామన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్: పండుగలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ రంగస్వామి సూచించారు. హనుమాన్ జయంతి శోభాయాత్ర, బక్రీద్ పండుగ, సందర్భంగా పట్టణంలోని ఏసీపీ కార్యాలయంలో మంగళవారం శాంతి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రంగస్వామి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పరమత సహనం పాటించాలన్నారు. బక్రీద్, హనుమాన్ జయంతి వేడుకలు హిందూ, ముస్లింలు సోదరభావంతో ఐకమత్యంగా జరుపుకోవాలని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై పై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, నాయకులు బాబర్‌ఖాన్, ఇబ్రహీం, వెంకటేశ్, జమ్రుద్‌ఖాన్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.



శాంతి సంఘం సమావేశంలో పాల్గొన్న పోలీసులు, నాయకులు